సాక్షి అనంతపురం

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



టన్ను చీనీ రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేలు, కనిష్టం



కిలో టమాట రూ.20
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా 5, సరాసరిన రూ.10 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/09.8°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పగలు ఎండ రాత్రి చలి వాతావరణం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



పంట దిగుబడిని పరిశీలిస్తున్న డీఏఓ చంద్రానాయక్

పెద్దవడుగూరు: రైతులు ఈక్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని విరుపాపురం గ్రామ సమీపంలో చేపట్టిన వేరుశనగ పంట కోత ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోరు కింద సాగు చేసిన వేరుశనగ పంటలో ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని తెలిపారు. గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ పంట నమోదు చేస్తారని సూచించారు. దీని ఆధారంగానే ప్రభుత్వాలు క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తాయన్నారు. గతేడాది ఇన్సూరెన్స్ డబ్బు ఇంకా రాలేదని కొందరు రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా.. త్వరలో అందరికీ డబ్బు జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మల్లీశ్వరి, ఏఈఓ సునీత, రజిని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

20 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఈ నెల 20 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులకు 20 నుంచి, రెగ్యులర్ విద్యార్థులకు 26వ తేదీ నుంచి మార్చి 7 వరకు పరీక్షలుంటాయన్నారు. జిల్లావ్యాప్తంగా 83 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

మార్చి 15 నుంచి థియరీ..
జిల్లావ్యాప్తంగా 60 కేంద్రాల్లో థియరీ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల రూట్‌లలో బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు 41,186 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. రెగ్యులర్, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థులు 18,599 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 22,587 మంది ఉన్నట్లు వివరించారు.


పోలీసు అదుపులో జంట హత్యల దుండగులు?

గుంతకల్లు: సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో దుండగులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. మొత్తం ముగ్గురు చిక్కినట్లు సమాచారం. గుంతకల్లులో ఈ నెల 14న జీపీ హేమకోటిరెడ్డితో పాటు అడ్డుకోబోయిన డ్రైవర్ షేక్షావలిని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. కోటిరెడ్డి ఇంట్లో సీసీ ఫుటేజీ లేకపోయినా ఇంటి బయట షాపులకు అమర్చిన సీసీ టీవీల్లో నిందితుల కదలికలు రికార్డవడాన్ని గుర్తించిన పోలీసులు వాటి ఆధారంగా జల్లెడ పట్టారు. సోషల్ మీడియాలో సైతం అనుమానాస్పద వ్యక్తుల ఫొటోలు, వీడియోలు హల్‌చల్ చేయడంతో ఏడు ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలించారు. ఈ క్రమంలోనే వారిని అదుపులోకి తీసుకున్నారు. కోటిరెడ్డి పెద్దనాన్న కేశవరెడ్డి మనవడు ఈ హత్యోదంతంలో ఉన్నట్లు సమాచారం. నిందితులను నేడో రేపో పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.

అక్రమాలు నిగ్గు తేలుస్తాం

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 17 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో జరిగిన కంప్యూటర్ల కొనుగోలు వ్యవహారంలో అక్రమాలు జరిగి ఉంటే నిగ్గు తేలుస్తామని ఐసీడీఎస్ ఆర్జేడీ పద్మజ తెలిపారు. సూపరింటెండెంట్ మంజులవాణి, సీనియర్ అసిస్టెంట్ బాషాతో కలిసి స్థానిక పీడీ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడారు. ఆరోపణలపై విచారణ కొనసాగుతోందన్నారు. అక్రమార్కులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అంతకుముందు స్థానిక ఇన్‌చార్జ్ పీడీ డాక్టర్ బీఎస్ శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ బాబా, ఈఓ భారతి, ఐసీపీఎస్ రాజేశ్ ఇతర సిబ్బంది ఆర్జేడీకి స్వాగతం పలికారు.


గ్రూపు-2లో కానిస్టేబుల్ సత్తా



స్నేహ

హిందూపురం: హిందూపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న స్నేహ గ్రూపు– 2 పరీక్షల్లో సత్తా చాటారు. గణాంకాల అధికారిగా ఎంపికయ్యారు. గురువారం ఫలితాలు విడుదలయ్యాయి. లేపాక్షి మండలం మానేంపల్లికి చెందిన రైతు గోపాల్, పద్మావతి ఈమె తల్లిదండ్రులు. స్నేహకు ఉద్యోగులతో పాటు గ్రామస్తులు, బంధువులు అభినందనలు తెలిపారు.

మందులోళ్లతో మనీబంధం



- అరవింద్‌నగర్‌కు చెందిన రమేష్ రెండు రోజుల క్రితం సాయినగర్ 3వ రోడ్డులోని ఓ దుకాణంలో మందులు కొనుగోలు చేశాడు. ఇంటికెళ్లాక వాటిని పరిశీలిస్తే కాలం చెల్లినవిగా తెలిసింది. వెంటనే సదరు దుకాణానికి వెళ్లి ప్రశ్నిస్తే మీరు ముందే చూసుకోవాలి... కొత్త మందులు ఇచ్చేది లేదంటూ అక్కడి వ్యక్తి దౌర్జన్యం చేశాడు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ దబాయించాడు. చేసేదిలేక రమేష్ వెనుదిరిగాడు.
- కల్యాణదుర్గానికి చెందిన ఓ వ్యక్తి కొత్తగా మెడికల్ షాపు కోసం దరఖాస్తు చేసుకున్నారు. మూడు వారాలు దాటినా అధికారులు పట్టించుకోలేదు. వాస్తవానికి అన్ని డాక్యుమెంట్లు సరిగా ఉంటే 14 రోజుల్లో అనుమతులివ్వాలి. ఇప్పటికే రూ.20 వేల వరకూ ఖర్చయ్యాయని, డాక్యుమెంట్లన్నీ కరెక్టుగా ఉన్నా అనుమతులు రావడం లేదని సదరు వ్యక్తి ఆవేదన వ్యక్తం చేసుకున్నారు.

- ఔషధ నియంత్రణ అధికారుల విచ్చలవిడితనం
- మందుల దుకాణదారుల నుంచి వసూళ్లపర్వం
- కంతుల వారీగా డబ్బు గుంజుతున్న వైనం
- సొమ్ము చెల్లిస్తే తనిఖీలు చేయమంటూ అభయం
- ముఖ్యఅధికారి కార్యాలయంలో వసూళ్లకే బంధుగణం!
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యం

ఉమ్మడి జిల్లాలో

మొత్తం దుకాణాలు	2,200
హోల్‌సేల్	120
రిటైల్	1,880
ఒక్కో దుకాణం వద్ద ఏడాదికి వసూలు	రూ.6వేలు
ఏడాదికి అన్ని దుకాణాల నుంచి	రూ.కోటివరకూ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో ఔషధ నియంత్రణ అధికారుల విచ్చలవిడిగా వసూళ్లకు తెర తీశారు. మెడికల్ షాపుల యజమానులతో వీరు కుదుర్చుకున్న 'మనీ' బంధంతో సామాన్యులు దగాకు గురవుతున్నారు. ఎవరైనా ఫ్రిజ్ గానీ, బైక్ గానీ, కారుగానీ కొంటే నెల వాయిదాల పద్ధతిలో సొమ్ము కడతారు. కానీ ఇక్కడ ఏడాదికి రెండు సార్లు చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఏటా డిసెంబర్, జూలైలో కచ్చితంగా నిర్ణయించిన మేర గుంజుతున్నట్లు సమాచారం. లేదంటే ఏదో ఒక వంక పెట్టి షాపుపై దాడులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కార్యాలయానికే చేర్చాలి..
ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2,200 వరకూ మందుల దుకాణాలున్నాయి. ఇందులో 120 హోల్‌సేల్ దుకాణాలుండగా, మిగతావి రిటైల్ షాపులు. వీటిల్లో మందుల అమ్మకం ఎలా ఉంది, కాలం చెల్లిన మందులు ఏమైనా విక్రయిస్తున్నారా? అమాయకులకు నకిలీ మందులేమైనా అంటగడుతున్నారా? దుకాణాల్లో ఫార్మసిస్ట్ ఉన్నాడా లేదా.. కోల్డ్‌చైన్ నిర్వహణ ఉందా లేదా ఇలాంటివన్నీ చూడాలి. అయితే, ఇవన్నీ లేకుండా ఆరుమాసాలకోసారి ఒక్కో దుకాణం నుంచి రూ.3 వేల చొప్పున ఏడాదికి రెండు సార్లు అంటే రూ.6 వేలు వసూలు చేస్తారు. మండలాల వారీగా అక్కడి అసోసియేషన్‌లే వసూలు చేసి ఏడీ కార్యాలయానికి చేర్చాలి. అర్బన్‌లో ప్రతి 30 దుకాణాలకు ఒక సంఘం ఉంటుంది. వీరు తెచ్చిన సొమ్ము అందరూ కలిసి పంచుకుంటారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. సదరు ముఖ్య అధికారి ప్రొద్దుటూరులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసినప్పుడు మెడికల్ దుకాణాల యజమానుల నుంచి వసూళ్లకు పాల్పడుతూ ఏసీబీ అధికారులకు దొరికిన విషయం ఈ చర్చలకు బలం చేకూరుస్తోంది.

లైసెన్సుకు వేలకు వేలు..
కొత్తగా మెడికల్ దుకాణం ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వానికి ఫీజు రూపంలో రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ రూ. 25 వేలు ఇవ్వనిదే ముఖ్యఅధికారి ఆఫీసులో ఫైలు కదలదు. అక్కడ పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మొత్తం అసిస్టెంట్ డైరెక్టర్‌కు బంధువులే. దీనిపై ప్రశ్నిస్తే లైసెన్సు ఇవ్వరేమోనన్న భయంతో వారు డిమాండ్ చేసినంతా ఇచ్చి లైసెన్సు తెచ్చుకుంటున్నారు. స్వయానా ఏడీ ఆఫీసులోనే సిబ్బంది నేరుగా ఫోన్‌పే ద్వారా సొమ్ము వేయించుకుంటున్నా దిక్కు లేదు. విజయవాడలో ఉన్న ఔషధ నియంత్రణ శాఖ నిఘా లేకపోవడంతో ఇక్కడ ఇలా జరుగుతోందన్న విమర్శలున్నాయి.

పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు

మందుల దుకాణాల యజమానులు ఔషధ నియంత్రణ అధికారికి పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒకవేళ అధికారి ఎవరైనా డబ్బడిగితే మాకు ఫిర్యాదు చేయచ్చు. నేరుగా గానీ, స్పందనలోగానీ అర్జీ ఇవ్వొచ్చు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రగ్ కంట్రోల్ డీజీకి కూడా లేఖ రాస్తాం.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

ఘనంగా కలెక్టర్ నాగలక్ష్మి వివాహం



వధూవరులు నవీన్‌కుమార్, నాగలక్ష్మి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ వివాహం గురువారం తిరుపతిలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. బుధవారం రాత్రి రిసెప్షన్ వైభవంగా నిర్వహించారు. 2012 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన నాగలక్ష్మి 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన నవీన్‌కుమార్‌ను మనువాడారు. ప్రస్తుతం నవీన్‌కుమార్ శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఆయన పెనుకొండ సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. కల్యాణోత్సవంలో జిల్లాకు చెందిన పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీఓలు మధుసూదన్, నిశాంత్‌రెడ్డి, పలువురు తహసీల్దార్‌లు వేడుకలో పాల్గొన్నారు.

జేసీజేల నియామకం

అనంతపురం: జిల్లాలోని పలు న్యాయస్థానాల్లో జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే)లను నియమించారు. గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జిగా జి.మంజుల నియమితులయ్యారు. అనంతపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నుంచి బాధ్యతలు తీసుకోనున్నారు. అలాగే, తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగా ఎం. చంద్రశేఖర్ రెడ్డి నియమితులు కాగా, అనంతపురం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ (స్పెషల్ మొబైల్ కోర్టు) నుంచి బాధ్యతలు తీసుకోనున్నారు.

తొలి రోజు రెండు నామినేషన్లు



ఆర్‌ఓ కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రవీంద్రారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రామచంద్రారెడ్డి

- ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ప్రారంభం
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీకి రవీంద్రారెడ్డి దాఖలు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల తొలి అంకం నామినేషన్ల ఘట్టం గురువారం ప్రారంభమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ కలెక్టరేట్‌లో నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం తన చాంబర్‌లో నామినేషన్లు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ఈనెల 23 వరకు కొనసాగుతుందన్నారు. 24న పరిశీలన నిర్వహిస్తామని, ఉపసంహరణకు 27 వరకూ అవకాశముంటుందని తెలిపారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్..
తొలి రోజున రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఎం.వి.రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీకి వెన్నపూస రవీంద్రారెడ్డి నామినేషన్ వేశారు. ఆర్‌ఓకు ఆయన చాంబర్‌లో నామినేషన్ పత్రాలను అందజేశారు. ఒక సెట్ నామినేషన్ వేసిన ఇరువురు అభ్యర్థులు, రెండో సెట్‌ను ఈనెల 22న దాఖలు చేస్తామని చెప్పారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విలేకరులతో ఎమ్మెల్సీ అభ్యర్థులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు
నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆర్‌ఓ కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు హద్దులు నిర్ణయించి పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ శివశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

'మీడియా పాయింట్' ఏదీ..?
పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ గురువారం ప్రారంభమైనప్పటికీ కలెక్టరేట్‌లో మీడియా పాయింట్‌ను, ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) సెంటర్‌ను ఏర్పాటు చేయలేదు. ఈ విషయంలో అధికార యంత్రాగం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. దీంతో కవరేజ్‌కు వచ్చిన మీడియా ప్రతినిధులు రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) చాంబర్ వద్ద కాచుకుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ కూర్చోవడానికి కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదు. తాగునీటి సదుపాయం కల్పించలేదు. దీంతో మీడియా ప్రతినిధులు ఇబ్బందికి గురయ్యారు. గతంలో ఎమ్మెల్సీ, సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి రెండు రోజుల ముందుగానే ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో మీడియా పాయింట్ ఏర్పాటు చేసేవారు. ఎన్నికలకు సంబంధించి పూర్తి సమాచారం, గత ఎన్నికలకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచేవారు. మీడియాకు, జిల్లా ఎన్నికల యంత్రాగానికి అనుసంధానంగా సమాచార శాఖ అధికారులు వ్యవహరించే వారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రాంభమైనప్పటికీ మీడియా పాయింట్‌ను ఏర్పాటు చేయకపోవడం అధికార యంత్రాగం నిర్లక్ష్యానికి దర్పణం పడుతోంది. అదే విధంగా ఎంసీఎంసీ సెంటర్‌నూ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

సమస్యల పరిష్కారానికి కృషి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అధికార పార్టీతో పాటు 36 ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. ఎన్నికల్లో ఉపాధ్యాయ ఓటర్లు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిలా ఉంటూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

– రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి

సంక్షేమ పథకాలే బలం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దీవెనలతో, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఆశీర్వాదంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నాకు గొప్ప బలం. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారు. రాయలసీమపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. నాకు ఓటు వేయాలని పట్టభద్ర ఓటర్లను వినమ్రంగా కోరుతున్నా.

– వెన్నపూస రవీంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి

ఉద్యాన పథకాల అమలు వేగవంతం

- జిల్లా ఉద్యానశాఖ అధికారి రఘునాథరెడ్డి



హెచ్‌ఓలతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన పథకాల అమలు వేగవంతం చేసి గడువులోపు లక్ష్యాలు సాధించాలని ఆ శాఖ జిల్లా అధికారి బి.రఘునాథరెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో హార్టికల్చర్ ఆఫీసర్స్ (హెచ్‌ఓలు)తో సమావేశం నిర్వహించారు. రూ.53 లక్షలతో 20 కమ్యూనిటీ ఫారంపాండ్ల నిర్మాణాలు, రూ.2 కోట్లతో రక్షిత సేద్యపు పద్ధతులు, పోస్ట్ హార్వెస్టింగ్ పథకాల స్థితిగతులు తెలుసుకున్నారు. గతేడాది, అంతకు మునుపు ఏడాది పండ్లతోటల సాగు చేసిన రైతులకు నిర్వహణ ఖర్చుల కింద చెల్లింపుల గురించి ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం (మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ హార్టికల్చర్–ఎంఐడీహెచ్) కింద కేటాయించిన రూ.7.18 కోట్లతో పథకాలు పూర్తి చేయాలన్నారు. చీనీ, నిమ్మ, దానిమ్మ, మామిడితో పాటు ఈ ఏడాది కొత్తగా 1,000 హెక్టార్లలో ఉసిరి, నేరేడు, చింత, డ్రాగన్‌ఫ్రూట్ తోటలను ప్రోత్సహించేందుకు రూ.1.60 కోట్లు వెచ్చించాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతు ఉత్పత్తి సంఘాలకు (ఎఫ్‌పీఓ), మహిళా సంఘాలకు రాయితీతో కలెక్షన్ సెంటర్లు మంజూరు చేయాలన్నారు. కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ, మంజూరు, క్షేత్రస్థాయి పరిశీలనలో ఏపీఎంఐపీకి సహకరించాలని సూచించారు.

ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం



ప్రతాప్ రెడ్డిపై దాడి చేయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులు

అనంతపురం: పాఠశాల విద్య ఆర్జేడీ బి. ప్రతాప్‌రెడ్డిపై కొందరు హత్యాయత్నం చేశారు. గురువారం ఆయన ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలతో పంగల్ రోడ్డులోని ఆర్డీటీ అంధుల పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రాత్రి ఆర్డీటీ అతిథి గృహంలో బస చేశారు. ఈ క్రమంలో ఆర్జేడీని కలవడానికి మిత్రులు, బంధువులు ఆర్డీటీ అతిథి గృహం వద్దకు వచ్చారు. ఈ సమయంలోనే ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులమంటూ ఐదుగురు అక్కడికి వచ్చారు. వచ్చిరాగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులను ప్రలోభ పెట్టడానికి వచ్చావంటూ ఆర్జేడీ బి. ప్రతాప్‌రెడ్డిపై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న ప్రతాప్ రెడ్డి బంధువులు, స్నేహితులు వారిని అడ్డుకున్నారు. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆర్జేడీపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి విధులకు ఆటంకం కలిగిస్తూ... ఆయన్ని హత్య చేయాలని పురమాయించిన వారి వివరాలను సైతం పోలీసులు రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు.

నా స్నేహితులే లేకపోతే ఏమయ్యేదో
తాను గురువారం ఉదయం ఆదోనిలో 300 మంది ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశానని, సమావేశం ప్రారంభంలోనే 'ఆర్జేడీ గో బ్యాక్.. వైఎస్సార్‌సీపీ ఏజెంట్ అంటూ కొందరు సమావేశాన్ని అడ్డగించారని ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎవరని ఆరా తీస్తే తాము ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులమని చెప్పారన్నారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని సమావేశాన్ని కొనసాగేలా చూశార్నారు. అలాగే అనంతపురంలో సమావేశం తర్వాత తాను ఆర్డీటీ అతిథి గృహంలో బస చేశానన్నారు. తన చిన్ననాటి మిత్రులంతా తనను చూసేందుకు రాగా, ఐదుగురు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులమని చెప్పి తాగి వచ్చారన్నరు. ఎక్కడ ఆర్జేడీ అంటూ ప్రతి గదిలోనూ వెతికారని, తనపై దాడికి దిగారన్నారు. ఆ సమయంలో నా స్నేహితులు లేకపోతే ఏమై ఉండేదో ఊహించలేనదని ఆర్జేడీ తెలిపారు. తాను ఎన్నికల నిబంధన ఉల్లంఘించినట్లు ఎవరైనా భావిస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసుకోవాలి గానీ, ఇలా భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తనకు భద్రత పెంచాలని కోరారు.



సింహ వాహనంపై బుగ్గ రామలింగేశ్వర స్వామి

● శివయ్య వైభవం

జిల్లాకు శివరాత్రి శోభ వచ్చేసింది. పలు చోట్ల శివాలయాల్లో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శివనామస్మరణతో ఆలయాలు ప్రతిధ్వనిస్తున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి గురువారం సింహ వాహనంపై అమ్మవారితో కలిసి దర్శనమిచ్చారు. అనంతపురం మొదటి రోడ్డులో వెలసిన కాశీవిశ్వేశ్వరుడు సతీసమేతుడై గజవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. - సాక్షి నెట్‌వర్క్



అనంతపురంలో గజ వాహనంపై ఊరేగుతున్న పార్వతీపరమేశ్వరులు

డీజిల్ సరఫరాకు టెండర్లు

అనంతపురం క్రైం: జిల్లాలోని వివిధ ఆర్టీసీ డిపోలకు రెండు నెలలు డీజిల్ సరఫరా చేసేందుకు టెండర్లను ఆహ్వానించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి సుమంత్ ఆర్ ఆదోని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 21వ తేదీ వరకూ అనంతపురం డిపోలో టెండర్ ఫారాలు అందజేస్తామన్నారు. 22 వరకూ దరఖాస్తుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలు http://www.apsrtc.ap.gov.inలో చూసుకోవచ్చు.

క్లుప్తంగా

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జేఎఫ్‌సీఎం



విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఓంకార్

ఉరవకొండ: స్థానిక రేణుమాకుపల్లి రహదారిలో ఉన్న బాలయోగి బాలికల గురుకుల పాఠశాలను ఉరవకొండ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (జేఎఫ్‌సీఎం) ఓంకార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థినులతో సమావేశమై మౌలిక వసతులు, పాఠ్యాంశాల బోధన తీరుపై ఆరా తీశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని, మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించారు. భోజనంలో నాణ్యత మరింత పెంచాలని నిర్వాహకులకు సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉండంతో అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపడాలని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

10న రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గం ఎన్నిక

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ నూతన కార్యవర్గం ఎన్నికలు మార్చి 10న జరగనున్నాయి. ఈ మేరకు సీనియర్ డీపీఓ చౌహాన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. 2023–25 ఆర్థిక సంవత్సరానికి రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గంలో సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీ, ఆరుగురు కమిటీ మెంబర్ల ఎన్నికకు సంబంధించి ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకూ నామినేషన్ దాఖలు ప్రక్రియ ఉంటుంది. నామినేషన్లు పరిశీలన అనంతరం మార్చి 1న పోటీకి అర్హత సాధించిన అభ్యర్థులను ప్రకటిస్తారు. అనంతరం మార్చి 3వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసహరణకు అవకాశముంటుంది. మార్చి 4న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, 10వ తేదీ పోలింగ్, అదే రోజు సాయంత్రం ఫలితాల వెల్లడి ఉంటుంది. కాగా, ఈ ఎన్నికల్లో మొత్తం 980 మంది రైల్వే ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాగా, 2019లోనే జరగాల్సిన ఈ ఎన్నికలు కోవిడ్ కారణంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే.

21న సీనియర్ ఆర్చరీ క్రీడాకారుల ఎంపికలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సీనియర్ ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 21న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ గురువారం తెలిపారు. అనంతపురంలోని ఆన్‌సెట్ కార్యాలయంలో చేపట్టనున్న ఈ ప్రక్రియకు క్రీడాకారులు ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరు కావాల్సి ఉంటుంది. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకూ విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. పూర్తి వివరాలకు 93989 69691లో సంప్రదించవచ్చు.

పదిలో ప్రథమమే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్‌జేడీ ప్రతాపరెడ్డి



సమావేశానికి హాజరైన హెచ్‌ఎంలు

- ఆర్‌జేడీ ప్రతాపరెడ్డి

రాప్తాడు: పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) బండ్లపల్లి ప్రతాపరెడ్డి సూచించారు. ఇందు కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన అంశంపై జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు, కేజీబీవీల ప్రత్యేకాధికారులు, ఎయిడెడ్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఏపీ మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో గురువారం రాప్తాడు సమీపంలోని ఆర్డీటీ అంధుల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌జేడీ ప్రతాపరెడ్డి హాజరై, మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పాఠశాల వేళల అనంతరం స్టడీ అవర్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వెనుకబడిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రణాళికాబద్ధమైన బోధన వల్ల విద్యార్థులు పాఠ్యాంశాలను సులువుగా అర్థం చేసుకోగలుగుతారన్నారు. 'సీ' గ్రేడ్ పిల్లలను 'ఏ' గ్రేడ్‌లోకి తీసుకురావడం ద్వారా రాష్ట్రంలోనే పది ఫలితాల్లో అనంతపురం జిల్లా మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు.

ఫిర్యాదుల బాక్స్‌లు పెట్టండి

ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆర్‌జేడీ ప్రతాపరెడ్డి ఆదేశించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఓ కాగితంపై రాసి బాక్స్‌లో వేసేలా విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మీ విధానం వల్ల మెరుగైన ఫలితాలు ఉంటాయని, సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేసేందుకు ఎంఈఓలు, హెచ్‌ఎంలు చొరవ చూపాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల వినియోగంపై ప్రతి ఉపాధ్యాయుడికీ అవగాహన ఉండాలన్నారు. విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువస్తోందని, ఇందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా బోధనా పద్ధతులను మార్చుకుని ముందుకు సాగాలన్నారు. ఏపీలో విద్యా వ్యవస్థను దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలు పరిశీలిస్తున్నాయన్నారు.

కార్పొరేటుకు దీటుగా

మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ బడులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిందని ఆర్‌జేడీ అన్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విద్యాప్రమాణాలు మెరుగుపడినప్పుడే విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన రూ.కోట్ల నిధులకు సార్థకత ఉంటుందన్నారు. రాప్తాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.నరసింహులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత గ్రాంట్లు ఇవ్వాలని, బెంచీలు, ఉచిత కరెంట్‌ను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈఓ సాయిరాం, సమగ్ర శిక్ష ఏపీసీ తిలక్ విద్యాసాగర్, డిప్యూటీ డీఈఓలు పాల్గొన్నారు.

వృద్ధురాలిని ఏమార్చి నగల అపహరణకు యత్నం

- పోలీసుల అదుపులో కేటుగాడు



మోసపోయిన తీరును పోలీసులకు వివరిస్తున్న గంగమ్మ (చిత్రంలో) నిందితుడు నరేంద్ర

పావగడ: వృద్ధురాలిని ఏమార్చి బంగారు నగలు అపహరించుకెళ్లే కేటుగాడి ప్రయత్నాన్ని స్థానికులు తెలివిగా తిప్పికొట్టారు. వివరాలు.. పావగడ తాలూకా బుదిబెట్ట గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు గంగమ్మ బుధవారం మధ్యాహ్నం పావగడ బస్టాండుకు చేరుకుంది. ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గమనించిన ఓ కేటుగాడు ఆమెతో మాటలు కలిపాడు. తనకు ప్రభుత్వాధికారులు తెలుసునని ప్రతి నెలా రూ.30 వేలు పింఛన్ వచ్చేలా చేస్తానన్నాడు. అతని మాటలపై నమ్మకం కలిగిన గంగమ్మ ఎలాగైనా పింఛన్ వచ్చేలా చేయమని వేడుకుంది. దీంతో కొన్ని రికార్డులు సిద్ధం చేసి, ఫొటో జతపరచాలని కేటుగాడు తెలిపాడు. ఇందుకు ఆమె సరేననడంతో మెడలో బంగారు నగలు ఉంచుకుని ఫొటో దిగితే పింఛన్ రాదని, ఆ నగలు తీసి తన చేతికి ఇస్తే భద్రంగా దాచి ఫొటో తీసిన తర్వాత అప్పగిస్తానన్నాడు. అప్పటికే అతని మాయలో చిక్కుకున్న వృద్ధురాలు తన మెడలోని రూ.60 వేలు విలువ చేసే బంగారు నగలు తీసిచ్చింది. అనంతరం ఆమెను సమీపంలోని బ్రైట్ ఫ్యూచర్ కంప్యూటర్ కేంద్రంలోకి పిలుచుకెళ్లి ఫొటో తీయాలని చెప్పాడు. యువకుడి వాలకంపై అనుమానం వచ్చిన కంప్యూటర్ కేంద్రం నిర్వాహకుడు వృద్ధురాలిని ఆరా తీయడంతో ఆమె అసలు విషయం తెలిపింది. అప్పటికే అక్కడి నుంచి ఉడాయిస్తున్న కేటుగాడిని కంప్యూటర్ కేంద్రం సిబ్బంది వెంబడించి పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. విచారణలో కేటుగాడిని అనంతపురం నగరానికి చెందిన నరేంద్రగా గుర్తించారు. బంగారు నగలను వృద్ధురాలికి అప్పగించి, మరోసారి అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మరాదని హితవు పలికారు. కాగా, గంగమ్మ ఇద్దరు కుమారులుండగా.. ఓ కుమారుడు తుమకూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా, మరో కుమారుడు వైద్య వృత్తిలో స్థిరపడ్డారు.

అనారోగ్యంతో విప్ కాపు సోదరుడి మృతి



కాపు హనుమంత రెడ్డి (ఫైల్)

రాయదుర్గం: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు (అన్న) కాపు హనుమంతరెడ్డి (65) అనారోగ్యంతో గురువారం తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న వెంటనే విజయవాడ నుంచి కాపు రామచంద్రారెడ్డి తిరిగి వచ్చారు. సోదరుడు నివసిస్తున్న బళ్లారి జిల్లా ఆంధ్రాళుకు సతీమణి కాపు భారతి, కుటుంబసభ్యులతో కలసి వెళ్లారు. సోదరుడి మృతదేహాన్ని చూడగానే బోరున విలపించారు. అనంతరం పాడెను మోసి, అంత్యక్రియలు పూర్తి చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, డి.హీరేహాళ్ మండల కన్వీనర్ వన్నూరుస్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్ నాయక్; ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, సర్పంచ్ ఉమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ సాగును పరిశీలించిన డీడీఎం

తలుపుల: మండలంలోని బి.కొత్తపల్లిలో 'రైతు ఉత్పత్తిదారుల సంఘం' చేపట్టిన సేంద్రి సాగు పద్ధతులను నాబార్డు ఉమ్మడి జిల్లా అభివృద్ధి మేనేజర్ (డీడీఎం) అనురాధ గురువారం పరిశీలించారు. అంతకు ముందు సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించి, పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం గొల్లపల్లితండాలో సోలార్ డ్రయర్, సమగ్ర వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు.

ప్రేమ.. పెళ్లి.. వేధింపులు!

- పోలీసులకు ఫిర్యాదు చేసిన నవవధువు
- ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బొమ్మనహాళ్: ప్రేమించాడు.. పెళ్లి చేసుకున్నాడు.. అనుమానంతో వేధించసాగాడు! ఇందుకు తల్లి, తమ్ముడు వత్తాసు పలికారు. దిక్కుతోచని స్థితిలో చివరకు నవవధువు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన ఎం.ఇంద్రజకు ఇది వరకే వివాహమైంది. భర్త చనిపోవడంతో కళ్యాణదుర్గానికి వెళ్లి టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తోంది. రోజూ బస్సులో కళ్యాణదుర్గానికి వెళ్లి వచ్చే క్రమంలో బొమ్మనహాళ్‌కు చెందిన జి.విష్ణుతో పరిచయం ఏర్పడింది. కళ్యాణదుర్గంలోని ఓ కళాశాలలో విష్ణు డిగ్రీ విద్యాభ్యాసం చేస్తున్నాడు. ఇద్దరూ దళిత సామాజిక వర్గానికి చెందిన వారే కావడంతో వారి మధ్య పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఈ ఏడాది జనవరిలో ఇంద్రజను విష్ణు పెళ్లి చేసుకుని ఇంటికి పిలుచుకెళ్లాడు. ఇంద్రజ పూర్వోత్తరాలపై అత్త శిల్ప ఆరా తీయడంతో ఇదివరకే పెళ్లి అయి భర్త మరణించిన విషయం తెలిసింది. ఓ కుమార్తె కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో విషయాన్ని విష్ణుకు తల్లి శిల్ప తెలిపింది. అప్పటి నుంచి గత వైవాహిక జీవితాన్ని ప్రశ్నిస్తూ ఇంద్రజను విష్ణు, అతని తల్లి, సోదరుడు విశాల్ తరచూ వేధించసాగారు. చివరకు వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో గురువారం ఉదయం బొమ్మనహాళ్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం విష్ణు, అతని తల్లి శిల్ప, సోదరుడు విశాల్‌పై వేధింపులు, ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. ఈ కేసును కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు విచారణ చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పప్పుశనగ పంట దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఉరవకొండ: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చేతికి వచ్చిన పప్పుశనగ పంట కాలి బూడిదైంది. వివరాలు... ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన రైతు గోవిందరెడ్డి 8.73 ఎకరాలు, శ్రీనివాసరెడ్డి, లక్ష్మి 4.87 ఎకరాల్లో రబీ సీజన్ కింద పప్పుశనగ సాగు చేశారు. పంట చేతికి రావడంతో తొలగించారు. వీరి ముగ్గురితో పాటు మరో రైతు వేలూరు లక్ష్మీదేవికి చెందిన 25 క్వింటాళ్ల పప్పుశనగ దిగుబడిని వాముగా వేసి నూర్పిడికి సిద్ధం చేశారు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. విషయాన్ని గమనించిన గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే నూర్పిడికి సిద్ధం చేసిన 15 ఎకరాల్లోని 110 క్వింటాళ్ల పప్పుశనగ పంట పూర్తిగా కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న మండల వ్యవసాయాధికారి శశికళ, వీఆర్వో, సచివాలయ ఉద్యోగులు గురువారం ఉదయం ఆమిద్యాలకు చేరుకుని పంట నష్టాన్ని అంచనా వేశారు. నలుగురు రైతులకు సంబంధించి రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. కాగా పంట నష్టపోయిన రైతులు నలుగురూ ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ పూర్తి చేయించుకున్నారని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ పరంగా బాధితులకు సాయం అందే అవకాశాలున్నాయన్నారు.

డీటీ సంతకంతో మాయ!

- మరణ ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయ ఉద్యోగి నిర్వాకం
- విషయం బయట పడడంతో మూడు రోజులుగా విధులకు డుమ్మా



మరణ ధ్రువీకరణ పత్రంలో డీటీ సంతకాన్ని అతికించిన దృశ్యం

పుట్లూరు: తప్పుడు ధ్రువీకరణ పత్రాల కోసం అధికారుల సంతకాలను ఫోర్జరీ చేయడమే ఇప్పటి వరకు తెలుసు. అయితే ఇందుకు భిన్నంగా ఏకంగా డిప్యూటీ తహసీల్దార్ సంతకాన్నే చోరీ చేసి తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసిన ఘటన పుట్లూరు మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు... పుట్లూరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అక్రమార్జన కోసం అడ్డదారులు తొక్కసాగాడు. ఈ క్రమంలో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని మంజూరుకు డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ ప్రసాద్ సంతకాన్ని చోరీ చేసి అడ్డంగా దొరికిపోయాడు.

ఫోర్జరీ కాదు.. సంతకమే చోరీ

పుట్లూరు మండలం బాలపురం సచివాలయ పరిధిలోని గోపురాజపల్లికి చెందిన వరలక్ష్మి 2001, ఏప్రిల్ 13న మృతి చెందింది. అవగాహన లేకపోవడంతో ఈ విషయాన్ని కుటుంబసభ్యులు అప్పట్లో రికార్డుల్లో నమోదు చేయించలేదు. ప్రస్తుతం బియ్యం కార్డులో పేరు తొలగించాల్సిన అవసరం ఏర్పడడంతో మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అయింది. దీంతో వరలక్ష్మి భర్త నారాయణరెడ్డి నేరుగా తహసీల్దార్ కార్యాలయాన్ని చేరుకుని అక్కడి ఉద్యోగిని సంప్రదించాడు. నిబంధన మేరకు రికార్డుల్లో నమోదు కాని ధ్రువీకరణ పత్రాలను కుటుంబసభ్యుల అభ్యర్థన మేరకు ఆర్డీఓ అనుమతితో సంబంధిత అధికారులు మంజూరు చేయాల్సి ఉంది. ఈ విషయంపై నారాయణరెడ్డికి అవగాహన కల్పించకుండా మొత్తం పని చేసిపెడతానని తనకు కొంత డబ్బు ఇవ్వాలని కోరాడు. దీంతో అతను అడిగిన మేరకు నారాయణరెడ్డి డబ్బు చెల్లించగానే సదరు ఉద్యోగి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సిద్ధం చేశాడు. అనంతరం కార్యాలయంలోని రికార్డుల్లో డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ ప్రసాద్ చేసిన సంతకాన్ని చించి తాను సిద్ధం చేసిన మరణ ధ్రువీకరణ పత్రంలో అతికించి ఇచ్చాడు.

బయటపడిందిలా...

తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగి అందజేసిన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుని నేరుగా బాలాపురం సచివాలయానికి నారాయణరెడ్డి చేరుకుని బియ్యం కార్డులో నుంచి తన భార్య పేరు తొలగించాలంటూ మరణ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశాడు. దానిని పరిశీలించిన డిజిటల్ అసిస్టెంట్ భూషణ్... అధికారి సంతకం ఉండాల్సిన చోట మరో రికార్డులో ఉన్న సంతకాన్ని కట్ చేసి అతికించి ఉండడాన్ని గమనించి ఆ పత్రం చెల్లదని తేల్చి చెప్పాడు. దీంతో తాను మోసపోయినట్లుగా తెలుసుకున్న నారాయణరెడ్డి మూడు రోజుల క్రితం తహసీల్దార్ సుమతిని కలసి ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న సదరు ఉద్యోగి అప్పటి నుంచి విధులకు హాజరు కాకుండా ముఖం చాటేశాడు. దీనిపై తహసీల్దార్ సుమతిని వివరణ కోరగా మరణ ధ్రువీకరణ పత్రంపై డిప్యూటీ తహసీల్దార్ సంతకాన్ని అతికించినట్లు గుర్తించామన్నారు. దీనిపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు.

వెటరన్స్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



తలపడుతున్న ఆర్డీటీ, హైదరాబాద్ వెటరన్ జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన క్రీడా మైదాన వేదికగా ఆర్డీటీ ఆధ్వర్యంలో మాంఛో రోలింగ్ ట్రోఫీ విన్సెంట్ ఫెర్రర్ వెటరన్స్ క్రికెట్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. ఆర్డీటీతో పాటు హైదరాబాద్, గుంటూరు, కడప, నెల్లూరు, విజయవాడ జట్లు ప్రాతినిథ్యం వహించనున్నాయి. తొలి మ్యాచ్‌లో ఆర్డీటీ (అనంతపురం), హైదరాబాద్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 229 పరుగులు చేసింది. జట్టులో గిరి 29 బంతుల్లో 10 ఫోర్లతో 60 పరుగులు సాధించి అజేయంగా నిలిచాడు. చంద్రశేఖర్ 42 పరుగులు, దామోదర్ 39 పరుగులతో అలరించారు. ఆర్డీటీ బౌలర్లలో ప్రదీప్, వెంకటేష్ చెరో 2 వికెట్లు, సాయికృష్ణ 1 వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్డీటీ జట్టు 24 ఓవర్లలోనే కేవలం 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో ప్రదీప్ 88 బంతుల్లో 17 ఫోర్లు, 1 సిక్సర్‌తో 134 పరుగులు సాధించాడు. హరినాథరెడ్డి 29 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 30, అక్బర్ 25 బంతుల్లో 4 ఫోర్లతో 29, శంకర్ 32 బంతుల్లో 2 ఫోర్లతో 28 పరుగులతో రాణించారు. 8 వికెట్ల తేడాతో ఆర్డీటీ జట్టు భారీ విజయాన్ని సాధించింది.

గర్భిణుల్లో రక్తహీనత నివారించాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: గర్భిణుల్లో రక్తహీనత, రక్తపోటు సమస్యల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ వీరబ్బాయి ఆదేశించారు. స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మాతా శిశు మరణాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. రెండు మాతృ, ఐదు శిశు మరణాలు చోటుచేసుకున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన నివేదికలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, ప్రోగ్రాం అధికారులు చెన్నకేశవులు, సుజాత, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు దినకర్, కుముద తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

రాయదుర్గం టౌన్: కారు ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని రప్పం గ్రామానికి చెందిన ఏడుగురు భవన నిర్మాణ కూలీలు గురువారం సాయంత్రం పని ముగించుకుని ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. రాయదుర్గం శివారులోని నీటి ట్యాంక్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. వెనువెంటనే ముందు వెళుతున్న ఎద్దుల బండిని ఆటో వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న తిప్పక్క, సిద్దన్న, జయమ్మ, రుద్రమ్మ, శివమ్మ, మహేష్, సుశీల తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న జయమ్మను వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

స్వీపర్ నిర్వాకంపై విచారణ

యాడికి: మండలంలోని రాయలచెరువు పీహెచ్‌సీలో ఉన్నతాధికారులు గురువారం విచారణ చేపట్టారు. తాము దుస్తులు మార్చుకుంటుండగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించేందుకు స్వీపర్ నరేంద్రరెడ్డి యత్నించాడని రెండు రోజుల క్రితం పలువురు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తాడిపత్రి డీఎస్పీ చైతన్యకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు ఆస్పత్రిలో విచారించారు. తాడిపత్రి రూరల్ సీఐ చిన్న పెద్దయ్య, ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి ఆస్పత్రి, వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనుపమ జేమ్స్ కూడా ఏఎన్‌ఎంలు, ఆశార్లు, మెడికల్ ఆఫీసర్లతో విడివిడిగా మాట్లాడారు.

సప్లయర్స్ సామగ్రి మీదపడి యువకుడి మృతి



మారేష్ (ఫైల్)

రాయదుర్గం: మరికొన్ని గంటల్లో శుభకార్యం జరగనున్న తరుణంలో ఓ యువకుడు మృతి చెందడంతో ఆ ఇంట విషాదం నెలకొంది. వివరాలు.. గుమ్మఘట్ట మండలం రంగచేడుకు చెందిన తిప్పక్క, వెంకటేష్ దంపతుల ఏకైక కుమారుడు మారేష్ (21) వ్యవసాయం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉండేవాడు. అదే గ్రామంలో నివసిస్తున్న తన మేనమామ ఆంజనేయులు కుమార్తె సీమంతం గురువారం రాత్రి ఉండడంతో ఇందుకు అవసరమైన వంట పాత్రలు, షామియానాలు, ఇతర సామగ్రిని సప్లయర్స్ దుకాణం వద్ద ఎద్ల బండిపై ఎక్కించి ఇంటికి బయలుదేరాడు. మార్గం మధ్యలో ఎద్దులు బెదరడంతో మొత్తం సామగ్రి బండి వెనుక నడుచుకుంటూ వెళుతున్న మారేష్‌పై పడ్డాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన మారేష్‌ను కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. విషయం తెలియగానే ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

మెకానిక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: 108 సర్వీసెస్‌లో మెకానిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని 108, 104 సర్వీసెస్ జిల్లా మేనేజర్ శివమనోజ్ ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, ఐటీఐ డీజిల్ మెకానిక్ విద్యార్హత కలిగిన వారు అర్హులన్నారు. బయోడేటాను ఈ నెల 21 సాయంత్రంలోపు సర్వజనాస్పత్రి డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలోని 108 సర్వీసెస్ కార్యాలయంలో అందించాలన్నారు.

'పాతూరు కస్తూర్బా' హెచ్‌ఎంకు షోకాజ్

అనంతపురం: నగరంలో పాతూరులో ఉన్న కస్తూర్బా మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం ప్రభావతమ్మకు డీఈఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు. పాఠశాలను గురువారం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వర్క్‌బుక్స్, నోటు బుక్స్‌ని సరిగా దిద్దలేకపోవడం, తరగతుల సిలబస్ పూర్తి కాకపోవడాన్ని ఆయన గుర్తించారు. దీంతో పాఠశాల హెచ్‌ఎం ప్రభావతమ్మ షోకాజ్ నోటీసు జారీ చేశారు. కాగా, నగరంలోని కేఎస్‌ఆర్ పాఠశాలనూ డీఈఓ తనిఖీ చేశారు. 'జగనన్న గోరుముద్ద'ను పరిశీలించారు. భోజనం బాగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

రేపటి నుంచి గుత్తి ఫోర్ట్ మీదుగా విజయవాడ ఎక్స్‌ప్రెస్

గుంతకల్లు: విజయవాడ–ధర్మవరం డైలీ ఎక్స్‌ప్రెస్ రైలును శనివారం నుంచి గుత్తిఫోర్ట్ రైల్వేస్టేషన్ మీదుగా మళ్లించినట్లు డివిజన్ అధికారులు తెలిపారు. దీంతో తాడిపత్రి–ధర్మవరం మధ్య రైళ్ల రాకపోకల సమయాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. విజయవాడ–ధర్మవరం (17215) ఎక్స్‌ప్రెస్ రైలు తాడిపత్రికి ఉదయం 7.09 గంటలకు, గుత్తి ఫోర్ట్ రైల్వేస్టేషన్‌కు ఉదయం 7.53, అనంతపురం 8.48, ధర్మవరం జంక్షన్ ఉదయం 9.50 గంటలకు చేరుతుంది.

- ధర్మవరం జంక్షన్ (17216) నుంచి సాయంత్రం 6.05 గంటలకు బయలుదేరి అనంతపురం 6.33, గుత్తి ఫోర్ట్ రైల్వేస్టేషన్‌కు రాత్రి 7.18, తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు రాత్రి 7.59 గంటలకు చేరుతుంది.

క్లుప్తంగా

పైప్‌లైన్ పనులు వేగవంతం



అరవిందనగర్ పార్క్ వద్ద పైప్‌లైన్ పనులు జరుగుతున్న దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలోని నీటి ట్యాంకుల పరిధిలో పైపులైన్ల మార్చే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గురువారం నగరంలోని అరవిందనగర్ పార్క్ వద్ద రోడ్డును జేసీబీతో తవ్వి పాత ఎంఎస్ పైప్‌ను తొలగించారు. వాటి స్థానంలో ఇనుప పైప్‌ను ఏర్పాటు చేశారు. ఈ పనులు పూర్తయితే 30 ఏళ్ల వరకు పైప్‌లైన్ లీకేజీ సమస్య ఉండదని డీఈ నరసింహ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కుంపట్టి భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు, సర్పంచ్‌లు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరై శాఖల వారిగా ప్రగతి నివేదికలను తెలియజేస్తారన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక




జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

రామగిరి: పేరూరుడ్యాంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పల్లవి త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి గురువారం తెలిపారు. పేరూరు పాఠశాల నుంచి ఈనెల 11 నుంచి 13 వరకు కృష్ణాజిల్లా విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 17 ఎస్‌జిఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున పల్లవి, కావ్య, హరిణి పాల్గొన్నారన్నారు. ఈపోటీల్లో పల్లవి రాణించడంతో త్వరలో ఢిల్లీలో జరగనున్న పోటీలకు ఎంపిక అయ్యిందన్నారు.

స్వయం ఉపాధి కోర్సులతో చేయూత

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్వయం ఉపాధి కోర్సులతో నిరుద్యోగ యువతకు మరింత చేయూతనిస్తున్నట్లు ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో టూ వీలర్ మెకానిక్, సెల్‌ఫోన్ రిపేర్ టెక్నీషియన్, లారీ డ్రైవింగ్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు, టూల్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని యువతీయువకులకు నిరంతరం విభిన్న కార్యక్రమాల ద్వారా మరింత సహకారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టూ వీలర్ మెకానిక్, సెల్‌ఫోన్ రిపేర్ టెక్నీషియన్, లారీ డ్రైవింగ్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందిన శిక్షకులు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగశివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఏపీ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ డైరీని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి గురువారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కారరావు, ప్రధాన కార్యదర్శి బాబాసాహెబ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షఫీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగమనెమ్మ, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపి, కార్యదర్శి రామూనాయక్, జిల్లా నాయకులు నూర్‌బాషా, వేణుగోపాల్, రామ్మోహన్, నాగేశ్వరయ్య, సుధాకర్, అశ్వర్థ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ప్రోత్సహిద్దాం

అనంతపురం కల్చరల్: ఇళ్లలో జరిగే శుభకార్యాలు వృద్ధులు, అనాథల మధ్య జరుపుకోవడం ద్వారా మానసిక తృప్తి పొందొచ్చని సత్యసాయి సేవాట్రస్టు మెంబర్ చైతన్య అన్నారు. ఈ మేరకు గురువారం చైతన్య, ఇతర సభ్యులతో కలిసి మధ్యాహ్నం ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం చేశారు.



రైల్వే స్టేషన్‌లో రెండు, మూడు కొత్త ప్లాట్ ఫాంలో రైలు బోగీ నంబర్లను చూపే సూచిక బోర్డులు లేని దృశ్యాలు

యువర్ అ'టెన్షన్'..ప్లీజ్..
నంబర్లు చూ'పెట్టె'ండి!

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల కోసం అన్ని సౌకర్యాలూ కల్పించాలి. సమయం, ప్లాట్‌ఫాం, నంబర్లు.. ఇవేకాకుండా తాగునీరు, కూర్చునేందుకు బల్లలు ఇలా మరెన్నో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ముఖ్యంగా ప్రయాణికులు గుర్తు 'పెట్టె'లా ఏర్పాట్లు చేయాలి. కానీ అనంతపురం రైల్వే స్టేషన్‌లోని నూతనంగా ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాంలలో బోగీలు చూపే బోర్డులు లేవు. సూచిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు. దీంతో బోగీ నంబర్ తెలుసుకోవడానికి టెన్షన్ తప్పడంలేదు. రైలు వచ్చి ప్లాట్‌ఫాంలో ఆగిన వెంటనే ప్రయాణికులు గందరగోళానికి గురవుతూ పెట్టెలు వెతుకుతూ పరుగులు తీయాల్సి వస్తోంది. దీనికితోడు అరకొర వసతులతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాల్సిన రైల్వే అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



రైల్వే ప్లాట్‌ఫాంలో రైలుకోసం వేచి ఉన్న ప్రయాణికులు



ప్రయాణించాల్సిన బోగీ కోసం వెతుకుతున్న ప్రయాణికులు



బోగి కోసం పరుగులు తీస్తున్న ప్రయాణికులు

దేశాభివృద్ధి యువతతోనే సాధ్యం

- డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి



జ్యోతిప్రజ్వలతో సదస్సు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మకుమారి కేంద్రం ఆధ్వర్యంలో యువజాగృతి సదస్సు గురువారం జరిగింది. యూత్ ఫర్ పీస్ అండ్ బ్లిస్ అనే అంశంపై సిస్టర్ శారద నేతృత్వంలో జరిగిన సదస్సుకు కోగటంతో పాటు ఏఎస్పీ హనుమంతు, ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, డాక్టర్ హేమలత, సీనియర్ అడ్వొకేట్ పద్మజ, ఎన్‌వైకే జిల్లా అధికారి శ్రీనివాసులు, దేవరకొండ కౌసల్య, వివేకానంద యోగ కేంద్ర రాజశేఖరరెడ్డి, బ్రహ్మకుమారి ఇన్‌చార్జ్ రాధ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ యువత శక్తివంతమైతే అసాధ్యమనేది ఉండదని అభిప్రాయపడ్డారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అంతకుముందు ప్రజాగాయకుడు లెనిన్ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

కృష్ణదేవరాయల స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగాలి



శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో చిన్నారులు



బహుమతులు అందజేస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, ఉద్యోగులు

- ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: కృష్ణదేవరాయల పేరుతో ఉన్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. గురువారం శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. భువన విజయం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజనీతి చతురత, ఆయన పాలన విధానాన్ని వివరించారు. ప్రధాన వక్తగా అంకె శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయలు తుళవ వంశానికి చెందిన వారైనప్పటికీ ఎన్నో భాషలపైన తనకు ఉన్న మక్కువను తెలియజేశారు. విదేశీయులు సైతం కొనియాడిన గొప్ప చక్రవర్తి అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు రచించిన అముక్తమాల్యదలో పొందుపరిచిన అంశాలపై వివరించారు. దేశభాషలందు తెలుగు లెస్స అని చెప్పడం ద్వారా తెలుగుభాషపైన ఉన్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో ఎస్కేయూ ఉద్యోగి సంజీవులు అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎస్కేయూ వీసీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చాగంటి రామిరెడ్డి, పీఆర్వో డాక్టర్ కే రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే బీఎన్ఆర్ జయంతి

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం మాజీ ఎమ్మెల్యే బీ నారాయణరెడ్డి జయంతి వేడుకలను గురువారం రాత్రి ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బీఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ ఉమా మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, ఎర్రిస్వామి రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ నూర్ మహమ్మద్, ధనుంజయ యాదవ్, ప్రతాప్‌రెడ్డి, అభిమానులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



బీఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంత ఆత్మబంధువు బీఎన్ఆర్

అనంతపురం టవర్‌క్లాక్: మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరెడ్డి అనంత ఆత్మబంధువు అని రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో మాజీ ఎమ్మెలే బి. నారాయణరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా సేవలు అందించారన్నారు. ఆయన లేని లోటు ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి ఓబిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై గంగాధరుడి దర్శనం

అనంతపురం కల్చరల్: మహాశివుడి బ్రహ్మోత్సవ వేడుకలు భక్తులకు నేత్రానందం కలిగిస్తున్నాయి. నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వేదమంత్రాలు, సామూహిక భజనలు, శివనామస్మరణతో ప్రతిధ్వనిస్తున్న ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక పరంపరలో ముంచెత్తుతున్నాయి. గురువారం రాత్రి స్వామివారు సతీసమేతుడై గజవాహనంపై నగరవీధుల్లో ఊరేగి దర్శనమిచ్చాడు. కోలాటం కళాకారులు లయబద్ధంగా చేస్తున్న నాట్యాలతో పరమశివుడు పరవశిస్తూ భక్తులను తరింపజేశాడు. ఉదయం ఆలయంలో దీక్షా హోమాలు, మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం నాట్యాచార్యులు పద్మావతి శిష్యబృందం కూచిపూడి నాట్యాలతో శివపార్వతులకు నీరాజనాలర్పించారు. ఈవో సుధారాణి, ఆలయ కమిటీ సభ్యులు తిమ్మారెడ్డి, కల్పన, నళిని, వెంకటస్వామి పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

కనగానపల్లి: మండలంలోని పలు శివాలయాల్లో శనివారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. కనగానపల్లి సమీపంలోని అతకల్లపట్నం మల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా చేస్తారు. రెండో రోజు స్వామి రథోత్సవం, పవాడం, గొరవయ్యల పాలు పట్టే కార్యక్రమాలు జరుగుతాయి. తర్వాతా మాలగొండ్ల వంశస్తులతో ఆడబిడ్డలకు వడిబియ్యం పెట్టడం, అరికి బండారు కట్టడం, అన్నదానం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన మాలధారుల భిక్ష

అనంతపురం కల్చరల్: మాలధారుల కోసం సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్ 1న విశాఖశారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రారంభించిన భిక్ష గురువారం ముగిసింది. మధ్యాహ్నం సామూహిక అన్నదానం అనంతరం నిర్వాహకులు విజయ్‌సాయికుమార్, రాఘవేంద్ర మాట్లాడారు. 77 రోజులుగా స్థానిక హరిహర ఆలయంలో మాలధారుల కోసం భిక్ష ఏర్పాటు చేశామన్నారు. 15 వేల మందికి భిక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

చెన్నేకొత్తపల్లి : అధైర్యపడొద్దు..అండగా ఉంటామని రాప్తాడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని మేడాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిగిచెర్ల వెంకటయ్య గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి మేడాపురానికి వెళ్లి వెంకటయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, ఎంపీటీసీ నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు జోగన్నగారి సూరి, లక్ష్మీరెడ్డి, మల్లికార్జున, జాలప్ప, మానేరు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

రామగిరి: మండల కేంద్రంలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ టింబక్ట్ కలెక్టివ్ చిగురు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో విద్యార్థుల ప్రతిభ ఆకట్టుకుంది. ఈక్రమంలో పర్యావరణం, కాలుష్యం, సోలార్, ఏటీఎం, మొక్కలు, అగ్నిపర్వతాలు పలురకాల ప్ర దర్శనలు విద్యార్థులు రూపొందించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీఈఓలు కాంచన, తిరుమల, ఇషిత, రమ్య, కల్పన, అలివేళమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు కంటి రెటీనా పరీక్షలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని జిల్లా త్వరిత చికిత్స కేంద్రంలో చిన్నారులకు కంటి రెటీనా పరీక్షలు గురువారం నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా గౌతమి ఐ ఇనిస్టిట్యూట్ రాజమండ్రి ట్రస్ట్ ఆధ్వర్యంలో రెడ్ కామ్ అనే పరికరంతో స్కీన్ నిర్వహించారు. మొత్తం 14 మంది పిల్లలను పరీక్షించగా, అందులో 11 మందికి సమస్యలున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ నారాయణస్వామి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీవిద్య, జ్ఞాన ప్రసన్న, మేనేజర్ రజిత, సిబ్బంది సుష్మా, దివ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్లకు స్వర్గధామం



నగరంలోని విద్యుత్‌నగర్ సర్కిల్ పాత ఎస్ఎస్‌సీ కార్యాలయం పక్కన సెల్లార్ ఏర్పాటు చేసిన దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలోని పలు ప్రాంతాల్లో సెల్లార్లకు ఎలాంటి అనుమతి లేకున్నా నిర్మాణదారులు యథేచ్ఛగా పనులు సాగిస్తున్నారు. విద్యుత్‌నగర్‌తో పాటు కమలానగర్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, వేణుగోపాల్‌నగర్, ప్రశాంతినగర్, తదితర ప్రాంతాల్లో అక్రమంగా సెల్లార్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదు. ఆ ప్రాంత ప్లానింగ్ కార్యదర్శి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నా అటువైపు తొంగిచూడ లేదన్న విమర్శలు ఉన్నాయి. కమిషనర్ భాగ్యలక్ష్మి సెల్లార్లను పూడ్చివేయిస్తామని చెప్పినా.. ఎవరూ ఖాతరులు చేయలేదు.

రేపటి నుంచి రైల్వేగేటు మూసివేత



గేటు దగ్గర రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రాప్తాడు: అనంతపురం–ధర్మవరం రైల్వే మార్గంలోని ప్రసన్నాయపల్లి–జంగాలపల్లి మార్గం మధ్యలో ఉన్న రాప్తాడు (గంగలకుంట) రైల్వే గేటు (124)ను నాలుగు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాప్తాడు నుంచి ధర్మవరం పంగల్ రోడ్డు వెళ్లే దారిలో ఉన్న గంగలకుంట రైల్వే గేట్ వద్ద రైల్వే బ్రిడ్జి స్టీల్ గ్రడ్డర్స్ లాంచింగ్ పనులు జరుగుతుండడంతో ఈ నెల 18 నుంచి 21 వరకు రైల్వే గేటు మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈదారి వెంట వెళ్లే ప్రయాణికులు గమనించి గంగలకుంట మీదుగా అనంతపురానికి, అనంతపురం నుంచి రాప్తాడుకు వచ్చే ప్రయాణికులు గంగలకుంట, కందుకూరు, జంగాలపల్లి మీదుగా చేరుకోవాలని సూచించారు. అనంతపురం నుంచి రాప్తాడుకు వచ్చే ప్రయాణికులు రుద్రంపేట, జేఎన్‌టీయూ మీదుగా రాప్తాడుకు చేరుకోవాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే మహిళలకు భద్రత

- నగర మేయర్ వసీం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే మహిళలకు భద్రత ఉందని, గత ప్రభుత్వాల కంటే భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల భద్రతకు పెద్దపీట వేస్తుంటే టీడీపీ నాయకులు రాద్ధాంతం చేయడం సరికాదని మేయర్ వసీం అన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి సీఎంను విమర్శిస్తూ పోస్టర్లను విడుదల చేయడాన్ని మేయర్ తప్పుబట్టారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థలోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అనతి కాలంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. మహిళల భద్రత కోసం అన్ని నియోజకవర్గాల్లో దిశ చట్టం తెచ్చి, పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారన్నారు. లక్షలాది మంది మహిళలకు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేసేలా వారిలో చైతన్యం తీసుకొచ్చారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన దౌర్జన్యకాండను మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి గుర్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయాలు, దౌర్జన్యాలు, మహిళలపై దాడులతో ప్రజలు ఎంతటి భయానక వాతావరణాన్ని ఎదుర్కొన్నారో ఇప్పటికీ మర్చిపోలేమన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు వ్యవస్థను బలోపేతం చేసిన గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చేస్తున్న ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే బురదజల్లడం తగదన్నారు. సమావేశంలో కార్పొరేటర్ లీలావతి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నాయకులు మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ఉత్తమ జీవితం

- ఆశ్రమాధిపతి శివరుద్రబాలయోగి మహారాజ్



మాట్లాడుతున్న శివరుద్రబాలయోగి మహరాజ్

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మికతతోనే ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని ఆశ్రమాధిపతి శివరుద్రబాలయోగి మహరాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీశివబాలయోగి ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన గురుసదన్‌ను విశిష్ట అతిథిగా విచ్చేసిన స్వామీజీ ప్రారంభించారు. ఆయన అనుగ్రహభాషణంలో భక్తితత్వంపై మాట్లాడారు. అంతకు ముందు స్వామీజీని ఆలయ పరిసర ప్రాంతాలలో వేదమంత్రాలు, మేళతాళాల మధ్య ఊరేగించారు. ఆశ్రమ అధ్యక్షుడు వెంకటేష్ గుప్తా, ఉపాధ్యక్షులు రత్నగిరి దేవరాజ్, సురేష్, మల్లికార్జున, విశ్వనాథ తదితరులు మాట్లాడారు. బాలయోగి ఆశ్రమం ద్వారా పేద విద్యార్థులకు ఉచిత చదువు, వసతి కల్పించేందుకు సన్నాహాలు చేశామన్నారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలో కొలువైన వేంకటేశ్వరస్వామి ద్వితీయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటెత్తిన భక్తజనం స్వామివారికి అలంకార సేవలు, అభిషేకాలు నిర్వహించారు. కావేరి శత లింగాలకు భక్తుల చేత సామూహిక క్షీరాభిషేకాలు నిర్వహించారు.

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

- సీఐ వెంకటేశ్‌నాయక్



ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్‌నాయక్

అనంతపురం సిటీ: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ తెలిపారు. స్థానిక సీఎంఎస్ నుంచి బదిలీపై వచ్చిన ఆయనకు ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో జనాభా రోజు రోజుకూ పెరిగిపోతోందని, అందుకు తగ్గట్టు వాహన వినియోగం కూడా భారీగా పెరిగిందన్నారు. ఆటోలు, ఇతర వాహనాలు ఎక్కడబడితే అక్కడ ఆపడంతో పాటు సాయంత్రమైతే చాలు ప్రైవేట్ ట్రావెల్స్ వారు నడిరోడ్లపైనే బస్సులు ఆపుతుండడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారిందని, ఎలాంటి చర్యలు తీసుకుంటారని విలేకరులు ఆయన్ను అడిగారు. దీనిపై ఆయనపై విధంగా స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే అంశంపై దృష్టి పెడతానన్నారు.